# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com


## పాఠశాలల నిర్వహణపై సీఎస్ సమీక్ష

హైదరాబాద్ , సెప్టెంబర్ 3:కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో పాటు వైద్య ఆరోగ్య, పంచాయతీ శాఖ అధికారులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. విద్యా సంస్థల పునః ప్రారంభంపై శుక్రవారం సీఎస్ సోమేశ్ సమీక్షచేశారు. ఉపాధ్యాయులు, సిబ్బందికి వంద శాతం టీకాలు వేయాలని ఆయన వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు.

అనంతరం టీకాలు వేయించుకున్నట్లు ఆయా పాఠశాలల వద్ద బ్యానర్లు కూడా ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అంతేగాకుండా విద్యాసంస్థలను ప్రతిరోజూ శుభ్రపరచాలని సీఎస్ ఆదేశించారు. ఎవరికైనా కొవిడ్ లక్షణాలు ఉంటే వెంటనే పరీక్షలు చేయించాలని సూచించారు. మధ్యాహ్న భోజనంపై పూర్తిస్థాయిలో జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.


హైదరాబాద్ శనివారం 4-9-2021 RNI No.52865/93-Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :28 సంచిక: 29 పేజీలు: 4 వెల: రూ.1/-


## ప్రధాని నరేంద్ర మోదీతో సీఎం కేసీఆర్ భేటీ



న్యూఢిల్లీ : ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి కేసీఆర్.. ప్రధాని నరేంద్ర మోదీని కలిసి రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. దాదాపు 50 నిమిషాల పాటు కొనసాగిన సమావేశంలో 10 అంశాలను కేసీఆర్ మోదీ దృష్టికి తీసుకెళ్లారు. ఐపీఎస్ క్యాడర్ రివ్యూ, రాష్ట్రంలో టెక్సటైల్ పార్క్ ఏర్పాటు, హైదరాబాద్- నాగపూర్ పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు, కొత్త జిల్లాల్లో నవోదయ విద్యాలయాల ఏర్పాటు చేయాలని మోదీని సీఎం కేసీఆర్ కోరారు. ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజనకు అదనపు నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన మెరుగుపరచడం కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. కరీంనగర్‌లో ట్రిపుల్ ఐటీ, హైదరాబాద్‌లో ఐఐఎంతో పాటు తెలంగాణలో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్ మోదీని కోరారు. ఈ ప్రతిపాదనలకు సంబంధించిన లేఖలను మోదీకి కేసీఆర్ అందజేశారు.

## ఆర్టీసీని కాపాడుకుందాం : ఎండీ సజ్జనార్

హైదరాబాద్ , సెప్టెంబర్ 3: తెలంగాణ ఆర్టీసీని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై కూడా ఉంది. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి.. సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని ఆర్టీసీ ఎండి సజ్జనార్ సూచించారు. ఆర్టీసీ ఆదాయం పెంచేందుకు చర్యలు చేపడుతాం. ఆర్టీసీ అభివృద్ధి విషయమై అధ్యయనం చేసి, కార్యాచారణ ప్రణాళిక రూపొందిస్తామన్నారు. ఆర్టీసీకి చాలా ఏండ్లుగా ప్రభుత్వం సహకారం అందిస్తోంది. ప్రభుత్వానికి భారం కాకుండా సొంతంగా నిలబడేందుకు చర్యలు తీసుకుంటామని సజ్జనార్ స్పష్టం చేశారు.

ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని బస్ భవన్‌లో ఆర్టీసీ ఎండీగా సజ్జనార్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సజ్జనార్ మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నో జిల్లాల్లో వివిధ హోదాల్లో పని చేసిన సందర్భాల్లో.. ఆర్టీసీ అధికారులతో సమావేశం అయ్యాను. ఆర్టీసీకి సంబంధించిన పలు అంశాలపై చర్చించిన అనుభవం ఉందన్నారు. గత ఏడాదిన్నర కాలం నుంచి ప్రపంచం వ్యాప్తంగా కరోనా మహమ్మారి వల్ల ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు. ఆర్థిక వ్యవస్థ కూడా బాగా దెబ్బతిన్నది. రవాణా పరిశ్రమ పూర్తిగా దెబ్బతిన్నది. టూరిజం వ్యవస్థ కూడా ఎఫెక్ట్ అయింది అని సజ్జనార్ పేర్కొన్నారు.

### కరోనా సమయంలో ఆర్టీసీ ఉద్యోగులు కీలకపాత్ర

గత 2 సంవత్సరాల్లో డిజీల్ రేట్లు రూ. 21 పెరిగింది. స్పేర్ పార్ట్స్ రేట్లు కూడా బాగా పెరిగిపోయాయి అని సజ్జనార్ తెలిపారు. దీంతో సమస్యలు రావడం జరిగిందన్నారు. మన ఆర్టీసీ సిబ్బంది కరోనా సమయంలో కూడా బాగా పని చేశారు. ఆక్సిజన్ సిలిండర్లతో పాటు మెడిసిన్స్‌ను ట్రాన్స్‌పోర్టు చేయడంలో చాలా కీలకపాత్ర పోషించారు. చాలా మంది ప్రాణాలను మనం కాపాడగలిగాం. ఆదాయాన్ని పెంచేందుకు కార్గో పార్శిల్ సర్వీసును ప్రారంభించాం. దాంతో కొంత ఆదాయం పెరిగిందన్నారు. మరింత ఆదాయం పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఈ క్లిష్ట సమయంలో రాష్ట్ర ప్రభుత్వం, సీఎం కేసీఆర్ ఆర్టీసీని ఆదుకున్నారు. లాక్‌డౌన్ సమయంలోనూ ఆర్టీసీ ఉద్యోగులకు పూర్తి స్థాయిలో జీతాలు చెల్లించారు.

ప్రభుత్వంపై భారం కాకుండా సొంతంగా నిలబడేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి. ప్రయాణికులకు మంచి సర్వీసును అందించేందుకు కృషి చేయాలి. ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమం కోసం కృషి చేస్తానని సజ్జనార్ చెప్పారు. గత మూడేండ్ల నుంచి ఇంచార్జి ఎండీగా పని చేసిన సునీల్ శర్మకు సజ్జనార్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## మెగా డెయిరీ నిర్మాణానికి మంత్రి తలసాని భూమి పూజ

హైదరాబాద్ , సెప్టెంబర్ 3:రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని రావిర్యాల గ్రామ పరిధిలో విజయ తెలంగాణ డెయిరీ ఆధ్వర్యంలో రూ. 250 కోట్ల వ్యయంతో నిర్మించనున్న మెగా డెయిరీ ప్లాంట్ నిర్మాణానికి మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి కలిసి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఎమ్మెల్సీలు సురభి వాణీదేవి, ఎగ్గే మల్లేశం, పశుసంవర్ధక శాఖ కార్యదర్శి అనిత రాజేంద్ర, అడిషనల్ డైరెక్టర్ రాంచందర్, టీఎస్ ఎల్డీఏ సీఈవో మంజువాణి, డెయిరీ చైర్మన్ లోక భూమారెడ్డి, కలెక్టర్ అమయ్ కుమార్, మత్స్య శాఖ కమిషనర్ లచ్చిరాం, డెయిరీ ఎండీ శ్రీనివాస్ రావు, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. విజయ డెయిరీతో చిన్న, సన్నకారు రైతులకు ఎంతో చేయూత ఉందన్నారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత విజయ డెయిరీ బలోపేతంపై సీఎం కేసీఆర్ దృష్టి సారించారని స్పష్టం చేశారు. రూ. 300 కోట్ల టర్నోవర్ నుంచి రూ. 750 కోట్ల టర్నోవర్‌కు పెంచామన్నారు. రావిర్యాలలో మెగా డెయిరీ ఏర్పాటుకు సీఎం కేసీఆర్ ఆదేశించారు. విజయ డెయిరీ ఉత్పత్తులు మొత్తం 28 ఉన్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో విజయ డెయిరీ ఔట్‌లేట్లు ఏర్పాటు చేశామన్నారు. పాడి రైతులకు చేయూత కోసం లీటర్‌పై రూ. 4 ప్రోత్సాహం ఇస్తున్నారని మంత్రి తలసాని పేర్కొన్నారు. విజయ డెయిరీ 365 రోజులు పాలు సేకరిస్తోందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం



చేశారు. 40 ఎకరాల విస్తీర్ణంలో రూ. 250 కోట్లతో దీనిని నిర్మించనున్నారు. రెండేండ్లలో నిర్మాణం పూర్తి చేసి, ఉత్పత్తుల తయారీ ప్రారంభించాలన్నది లక్ష్యం. డెయిరీ నిర్మాణంలో విశేష అనుభవం ఉన్న నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు(ఎన్‌డీడీబీ)కు నిర్మాణ బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. ఇది అందుబాటులోకి వస్తే రోజువారీ పాల ఉత్పత్తి సామర్థ్యం 8 లక్షల లీటర్లకు పెరుగుతుంది. ప్రస్తుతం లాలాపేటలో ఉన్న విజయ ప్లాంట్‌కు రోజుకు 3.5 లక్షల లీటర్ల పాలను ప్రాసెసింగ్ చేసే సామర్థ్యం ఉన్నది. మెగా డెయిరీతో పాలఉత్పత్తి సామర్థ్యం రెండు నుంచి మూడు రెట్లు పెరిగి, మరికొన్ని రకాల ఉత్పత్తులను భారీఎత్తున చేపట్టే అవకాశం లభిస్తుంది. 75 వేలమంది పాడి రైతులకు సభ్యత్వం ఉన్న విజయ డెయిరీ.. పీక్ సీజన్‌లో రోజుకు 4.5 లక్షల లీటర్లు, వేసవిలో 2.5 లక్షల లీటర్ల పాలను సేకరిస్తున్నది. మెగా డెయిరీ వస్తే.. మరింత మంది పాడి రైతులకు లబ్ధిచేకూరనున్నది. మార్కెట్‌లోకి 14 రకాల స్వీట్లు విడుదలవిజయ బ్రాండ్ పేరుతో నేటి నుంచి 14 రకాల స్వీట్లు అందుబాటులోకి వచ్చాయి. గులాబ్‌జామ్, రాగి, బేసన్, మలాయ్, జోవర్, మల్టీమిల్లెట్ లడ్డులు, సున్నుండలు, బాదంహల్వా, కాజూకట్లీ, చాకోబర్ఫీ, సోన్‌పాప్‌డీ వంటి స్వీట్లను అందుబాటులోకి వచ్చాయి. పాలు, పాల ఉత్పత్తులతోపాటు ఇప్పటికే 57 రకాల ఉత్పత్తులను విజయ బ్రాండ్‌తో విక్రయిస్తున్నారు. ఇటీవలే ఐస్‌క్రీం ఉత్పత్తిని కూడా ప్రారంభించింది. మెగా డెయిరీ నిర్మాణం పూర్తయితే రోజుకు 5 వేల లీటర్ల ఐస్‌క్రీమ్‌లను తయారుచేసే సామర్థ్యాన్ని అందిపుచ్చుకుంటుంది.

## వ్లాదివోస్తోక్ లో జరిగిన 6వ ఈస్టర్న్ ఇకనామిక్ ఫోరమ్ 2021 లో వర్చువల్ మాధ్యమం ద్వారా ప్రసంగించిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ వ్లాదివోస్తోక్ లో ఈ రోజు న జరిగిన 6వ ఈస్టర్న్ ఇకనామిక్ ఫోరమ్ (ఇఇఎఫ్) సర్వ సభ్య సదస్సు లో వీడియో కాన్ఫరెన్స్ మాధ్యమం ద్వారా ప్రసంగించారు. 2019వ సంవత్సరం లో జరిగిన ఇఇఎఫ్ 5వ సదస్సు లో ముఖ్య అతిథి గా ప్రధాన మంత్రి వ్యవహరించారు. ఇఇఎఫ్ సదస్సు లో భారతదేశ ప్రధాన మంత్రి ముఖ్య అతిథి గా వ్యవహరించడం అదే తొలి సారి.

రష్యా లోని దూర ప్రాచ్య ప్రాంతాల అభివృద్ధి విషయం లో అధ్యక్షుడు శ్రీ పుతిన్ దార్శనికత ను ప్రధాన మంత్రి ప్రశంసిస్తూ, ఈ విషయం లో భారతదేశం తన 'యాక్ట్ ఈస్ట్ పాలిసి' లో భాగం గా రష్యా కు ఒక విశ్వసనీయ భాగస్వామి గా ఉంటుందని పునరుద్ఘాటించారు. రష్యా లోని దూర ప్రాచ్య ప్రాంతం అభివృద్ధి విషయం లో రష్యా కు, భారతదేశాని కి సహజమైన అనుబంధం ఉందని ఆయన స్పష్టం చేశారు.

'ప్రత్యేకమైనటువంటి, విశేష అధికారాలు కలిగినటువంటి వ్యూహాత్మక భాగస్వామ్యాని' కి అనుగుణం గా ఇరు పక్షాల మధ్య మరింత ఎక్కువ ఆర్థికపరమైనటువంటి, వాణిజ్యపరమైనటువంటి సహకారానికి ప్రాముఖ్యాన్ని ఇవ్వాలి అని ప్రధాన మంత్రి నొక్కి చెప్పారు. మహమ్మారి కాలం లో ఆరోగ్య సంబంధి, ఔషధ నిర్మాణ సంబంధి రంగాలు సహకారానికి ప్రముఖమైన రంగాలు గా పేరు తెచ్చుకొన్నాయి అని ఆయన ప్రముఖం గా ప్రకటించారు. అలాగే, ఆర్థిక సహకారం పరం గా అవకాశాలు ఉన్న ఇతర రంగాల లో వజ్రాలు, కోకింగ్ కోల్, ఉక్కు, కలప వంటి రంగాలు ఉన్నాయని కూడా ఆయన పేర్కొన్నారు.

భారతదేశం లోని కొన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఇఇఎఫ్-2019 ను సందర్శించడాన్ని ప్రధాన మంత్రి గుర్తు కు తెస్తూ, రష్యా లో 11 దూర ప్రాచ్య ప్రాంతాల గవర్నర్ లు భారతదేశం సందర్శనకు తరలి రావాలంటూ ఆహ్వానించారు.

కోవిడ్ మహమ్మారి సవాళ్ళ ను విసురుతూ ఉన్నప్పటికీ, పెట్రోలియం-సహజవాయువు శాఖ మంత్రి శ్రీ హర్‌దీప్ సింహ్ పురి నాయకత్వం లో భారతదేశాని కి చెందిన ఒక ప్రతినిధి వర్గం ఇండియా-రష్యా బిజినెస్ డైలాగ్ కు హాజరు అవుతోంది.

దీనిలో ప్రముఖ చమురు కంపెనీలు, గ్యాస్ కంపెనీ ల ప్రతినిధులు కూడా ఉన్నారు. ఇఇఎఫ్ సందర్భం లో సఖా-యాకూతియా ప్రావిన్స్ గవర్నర్, గుజరాత్ ముఖ్యమంత్రి శ్రీ విజయ్ రూపాణీ లు ఈ నెల 2న ఆన్‌లైన్ మాధ్యమం ద్వారా సమావేశమయ్యారు. వివిధ రంగాల కు చెందిన ప్రముఖ భారతీయ కంపెనీల ప్రతినిధు లు 50 మంది కి పైగా కూడాను ఆన్ లైన్ మాధ్యమం ద్వారా పాలుపంచుకోనున్నారు.

## ఆకాశంలో ప్రయోగించగల మానవ రహిత ఏరియల్ వాహనం నిర్మాణం కోసం ఒప్పందంపై సంతకాలు చేసిన భారత్, యుఎస్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3:ఎఎల్‌యుఎవి (సాధారణ పరిభాషలో డ్రోన్ అనే వాహనం) నమూనాను కలిసి అభివృద్ధి చేస వ్యవస్థల రూపకల్పన, అభివృద్ధి, ప్రదర్శన, పరీక్ష, అంచనాల కోసం భారతీయ వైమానిక దళం ఉ డిఆర్‌డిఓ మధ్య సహకారాన్ని వివరిస్తుంది.

రక్షణ సాంకేతిక, వాణిజ్య చొరవ లోని ఎయిర్ సిస్టమ్స్‌పై వర్కింగ్ గ్రూపు కింద ఆకాశంలోకి ప్రయోగించే మానవరహిత ఏరియల్ వాహనం (ఎఎల్‌యుఎవి) కోసం రక్షణ శాఖ, యుఎస్ రక్షణ శాఖ ప్రాజెక్టు ఒప్పందంపై జులై 30,2021న సంతకాలు చేశాయి. ఈ ఒప్పందం తొలుత జనవరి 2006లో రక్షణ శాఖ, యుఎస్ రక్షణ శాఖ మధ్య పరిశోధన, అభివృద్ధి, ప్రయోగం, అంచనా (ఆర్‌డిటి ఉఇ) పై సంతకాలు చేసిన అవగాహనా ఒప్పందం పరిధిలోనిది. ఈ ఒప్పందాన్ని జనవరి 2015న పునరుద్ధరించారు. రక్షణ పరికరాలను కలిసి అభివృద్ధి చేయడం ద్వారా రెండు దేశాల మధ్య రక్షణ సాంకేతిక సహకారం మరింత గాఢమయ్యే దిశగా ఈ ఒప్పందం కీలక అడుగు.

భారత్, యుఎస్ సైనిక దళాల కోసం భవిష్యత్ సాంకేతికతలను సహ అభివృద్ధి, సహ ఉత్పత్తికి అవకాశాలను సృష్టించడం, ఇరుదేశాల మధ్య సహకార సాంకేతికతను ప్రోత్సహించడం పై నాయకత్వ దృష్టి నిరంతరం ఉంచేలా చేయడం డిటిటిఐ ప్రధాన లక్ష్యం. డిటిటిఐ కింద, భూమి, నావికా, వైమానిక, విమాన వాహన నౌకల సాంకేతికతలపై సంయుక్త వర్కింగ్ గ్రూపులు ఏర్పాటు అయ్యాయి. ఆయా విభాగాలలో పరస్పరం అంగీకరించిన ప్రాజెక్టులపై దృష్టి పెట్టేందుకు ఈ గ్రూపులను ఏర్పాటు చేయడం జరిగింది. ఎఎల్‌యుఎవి సహ అభివృద్ధి కోసం చేసుకున్న ఆమోదిత ప్రాజెక్టును ఎయిర్ సిస్టంస్ పై సంయుక్త వర్కింగ్ గ్రూపు పర్యవేక్షించింది. ఇది డిటిటిఐ ప్రధాన విజయం.

ఎఎల్‌యుఎవి (సాధారణ పరిభాషలో డ్రోన్ అనే వాహనం) నమూనాను కలిసి అభివృద్ధి చేస వ్యవస్థల రూపకల్పన, అభివృద్ధి, ప్రదర్శన, పరీక్ష, అంచనాల కోసం ఎయిర్‌ఫోర్స్ రీసెర్చ్ లాబొరేటరీ, భారతీయ వైమానిక దళం ఉ డిఆర్‌డిఓ మధ్య సహకారాన్ని ఆమోదిత ప్రాజెక్టు వివరిస్తుంది. ఆమోదిత ప్రాజెక్టు అమలుకు భారత, యుఎస్ వైమానిక దళాలతో కలిసి డిఆర్‌డిఓలోని ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్, ఎయిర్ ఫోర్స్ రీసెర్చ్ లాబొరేటరీ (ఎఎఫ్ఆర్ఎల్) ఎయిరోస్పేస్ సిస్టంస్ డైరొక్టరేట్ ప్రధాన సంస్థలుగా ఉంటాయి.

డిటిటిఐ కింద ఎయిర్ సిస్టంస్ సంయుక్త వర్కింగ్ గ్రూప్ సహ అధ్యక్షులు – భారతీయ వైమానిక దళానికి చెందిన ఎయిర్ వైస్ మార్షల్ నర్మదేశ్వర్ తివారీ, యుఎస్ వైమానిక దళం డైరెక్టర్, ఎయిర్ ఫోర్స్ సెక్యూరిటీ అసిస్టెన్స్ అండ్ డైరెక్టొరేట్ బ్రిగేడియర్ జనరల్ బ్రియాన్ ఆర్, బ్రక్‌బ్యూర్ ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు.

## రాబోయే 3 గంటల్లో పలు జిల్లాల్లో వర్షాలు!

హైదరాబాద్ , సెప్టెంబర్ 3: గత నాలుగైదు రోజుల నుంచి రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న విషయం విదితమే. నిన్న రాత్రి హైదరాబాద్‌లో వర్షం దంచికొట్టింది. తాజాగా రాష్ట్రంలోని పలు జిల్లాలకు ఐఎండీ ( భారత వాతావరణ శాఖ ) వర్ష సూచన చేసింది.రాబోయే 3 గంటల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాలతో పాటు నల్లగొండ, సూర్యాపేట, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఐఎండీ సూచించింది. ఇప్పటికే కురిసిన భారీ వర్షాలకు రాష్ట్రంలోని జలాశయాలు, చెరువులకు, కుంటలకు జలకళ వచ్చింది.

## నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేదలో ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయుష్ మంత్రి సర్బానంద సోనోవాల్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3:ఆయుష్, పోర్ట్, షిప్పింగ్, వాటర్‌వేస్ మంత్రి శ్రీ సర్బానంద సోనోవాల్ 'ఆజాది కా అమృత్ మహోత్సవ'లో భాగంగా జైపూర్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద (ఎన్ఐఏ) లో ఆయుష్ రోగనిరోధక మందులు, ఆహారం, జీవనశైలిపై ముద్రించిన మార్గదర్శకాలను పంపిణీ చేసే ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ ప్రచారంలో భాగంగా గుడుచి లేదా గిలోయ్ ఘన్ వటి, అని కూడా పిలిచే సంశమణివటి, అశ్వగంధవటి వృద్ధుల (60 సంవత్సరాలు మరియు అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న ప్రజలు) జనాభాపై ప్రత్యేక దృష్టి పెడుతూ ముందు వరుస కార్మికులతో సహా దేశవ్యాప్తంగా 75 లక్షల మందికి రాబోయే ఒక సంవత్సరంలో పంపిణీ చేస్తారు. ఈ సభలో ప్రసంగించిన శ్రీ సోనోవాల్, ఆయుర్వేద సందేశాన్ని దేశవ్యాప్తంగా వ్యాప్తి చేయడం ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు, తద్వారా ప్రతిఒక్కరూ తమ జీవనశైలిని, ఆరోగ్యవంతమైన దేశసామజిక లక్ష్యాన్ని సాధించాలని అన్నారు. మొత్తం ఆయుర్వేద సమాజం, చేతులు కలిపి కలిసి పనిచేయాలి, తద్వారా భారతదేశం తన పురాతన ఆయుర్వేద, యోగ జ్ఞానం ద్వారా ప్రపంచాన్ని నడిపిస్తుంది. అని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. కేంద్ర మంత్రి ఎన్ఐఏ ఆసుపత్రిని కూడా సందర్శించారు, అక్కడ విద్యార్థులు మరియు ఆసుపత్రి సిబ్బందితో సంభాషించారు. ప్రత్యేకంగా ఆసుపత్రిలో పరిశుద్ధత, పరిశుభ్రతను ప్రశంసించారు. ఆయుర్వేద ఔషధాల కిట్, మార్గదర్శకాలను ఆయుర్వేద ఔషధ పరిశోధనక సెంట్రల్ కౌన్సిల్ (సిసిఆర్ఏసి) తయారు చేసింది. భారతదేశ 75 సంవత్సరాల స్వాతంత్ర్యానికి గుర్తుగా భారత ప్రభుత్వం ప్రారంభించిన 'ఆజాది కా అమృత్ మహోత్సవ్' ప్రచారంలో భాగంగా రోగనిరోధక ఔషధాలు, ఆహారం, జీవనశైలి మార్గదర్శకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. భారతదేశం స్వాతంత్ర్య 75 వ వార్షికోత్సవాన్ని జరుపుకునే ఆగస్టు 2022 వరకు ఏడాది పొడవునా ప్రచారం కొనసాగుతుంది.

### చరిత్రలో నేటినిజం



మౌనదయాంతరసీమలలో
పడిలమ్మున నిలచియుండు పలు పాత్రలకున్
విదుడై ప్రాణము బోసిన
ముదితాత్ముండగు ఋషికపూరును దలతున్

( సెప్టెంబర్ 4 నటుడు రిషీకపూర్ జయంతి..)

-రాధశ్రీ



సెల్: 9494481210

## వివాహితకు లైంగిక వేధింపులు : వారించిన భర్తపై దాడి

లక్నో , సెప్టెంబర్ 3:: తన భార్యను వేధిస్తున్న ఆకతాయిలను వారించిన వ్యక్తిపై నిందితులు ఇనుప రాడ్‌తో దాడికి పాల్పడిన ఘటన యూపీలోని మీరట్ జిల్లాలో వెలుగుచూసింది.

లిసారి గేట్ ప్రాంతంలో వివాహితను అదే ప్రాంతానికి చెందిన యువకులు కొంతకాలంగా వేధిస్తున్నారు. ఆమె బయటకు వెళ్లినప్పుడు నిందితులు వెంబడించి మొబైల్ ఫోన్ నెంబర్ అడుగుతుండటంతో వీరి ఆగడాలను భర్తకు తెలిపింది.

మహిళ గురువారం ఇంటి బయట ఉన్న సమయంలో మరోసారి ఆమెను నిందితులు వేధించారు. దీంతో వివాహిత భర్త నేరుగా నిందితుల ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులకు ఫిర్యాదు చేశాడు. వివాహిత భర్తపై ఆగ్రహంతో నిందితులు అతడిపై ఇనుప రాడ్‌తో దాడికి దిగి గాయపరిచారు. స్థానికులు బాధితుడిని కాపాడి దవాఖానకు తరలించారు. మహిళ ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

## ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా జాతీయ స్థాయిలో మహాత్మా గాంధీ ఎన్ఆర్ఇజిఎ హక్కులు/ అర్హతల అవగాహన వారోత్సవం



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3:ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మహాత్మా గాంధీ ఎన్ఆర్ఇజి చట్టంలో పొందు పరిచిన హక్కులు, ఉపాధి గురించి శ్రామికులలో చైతన్యం/ అవగాహన తీసుకువచ్చేందుకు ఉపాధి అవగాహన వారోత్సవాలను రాష్ట్రాలు / కేంద్రపాలిత ప్రాంతాలు నిర్వహించాయి. ఈ వారోత్సవాలను 27 ఆగస్టు నుంచి 2 సెప్టెంబర్ 2021 వరకు జరిగాయి. ఉపాధి కోరుతున్న వారికి చట్టంలోని అనేక అంశాల ద్వారా మహాత్మాగాంధీ ఎన్ ఆర్ఇజిఎ అనేక చట్టపరమైన హక్కులను కల్పిస్తుంది.

సిక్కింలోని పశ్చిమ జిల్లాలో మహాత్మా గాంధీ ఎన్ఆర్ఇజిఎ చట్టం కింద గల హక్కులు, ఉపాధి అవకాశాల గురించి శ్రామికులలో చైతన్యాన్ని తీసుకువచ్చేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. ప్రజలకు ఉపాధి అవకాశాలను అందుబాటులోకి తెచ్చేందుకు రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాలు అనేక చొరవలు తీసుకున్నాయి. తమ తమ జిల్లాలు, బ్లాకులు, గ్రామ పంచాయితీలలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు సమన్వయంతో పలు కార్యకలాపాలను నిర్వహించాయి. శ్రామికుల సౌకర్యార్థం వివిధ జిల్లాలలో గ్రామ పంచాయితీ భవనాలలో గ్రామ సభలు నిర్వహించగా, కొన్ని జిల్లాలలో పని ప్రాంతంలో కార్మికులను అధికారులు కలుసుకున్నారు. వివిధ రాష్ట్రాలు, కేంద్ర ప్రాంతాలలో అధికారులు, ఉద్యోగులు మహాత్మా గాంధీ ఎన్ఆర్ఇజిఎ లబ్ధిదారులు ఈ కార్యక్రమంలో చురుకుగా, ఉత్సాహంతో పాల్గొన్నారు. ఈ ఉపాధి, హక్కుల చైతన్యం గురించిన కార్యక్రమాలు లబ్ధిదారులు మహాత్మగాంధీ ఎన్ఆర్ఇజి పథకం నుంచి గరిష్టంగా లబ్ధి పొందేందుకు తోడ్పడతాయి.

దుంగర్‌పూర్ జిల్లాలో గ్రామ పంచాయితీ సమితి ఎంజిఎన్ఆర్ఇజిఎ కార్మికుల కోసం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించింది.

# కాంగ్రెస్ పరువు తీసేది ఎవరు?

హైదరాబాద్ , సెప్టెంబర్ 3:తెలంగాణ పీసీసీ చీఫ్ పదవి దక్కకపోవడంతో పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చర్యలు చర్చనీయాంశం అవుతున్నాయి. గతంలో గాంధీ భవన్ మెట్లే ఎక్కనని తేల్చి చెప్పిన కోమటిరెడ్డి.. అనంతరం విభేదాలు పక్కన బెట్టి అందరం కలిపి పనిచేస్తామంటూ స్టేట్ మెంట్ ఇచ్చారు. అయితే, షర్మిల పార్టీకి బహిరంగంగా మద్దతు ఇవ్వడం రాజకీయ వర్గాల్లో సంచలనం అయింది.

జులై 8న పార్టీ షర్మిల పార్టీ ప్రకటన సందర్భంగా ఆరోజే ఆమెకు శుభాకాంక్షలు తెలిపిన కోమటిరెడ్డి.. సెప్టెంబర్ 2న వైఎస్ వర్ధంతి సందర్భంగా విజయమ్మ ఏర్పాటు చేసిన వైఎస్ సంస్మరణ సభకు ఆయన హాజరు కావడం హాట్ టాపిక్ గా మారింది. సభకు వెళ్లొద్దని పార్టీ అగ్రనేతలు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా.. ఆయన మాత్రం అవి పట్టించుకోకుండా సభకు వెళ్లారు. ఈ క్రమంలో కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పీసీసీ ఆదేశాలపై ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డిని తీసి పక్కన పడేసినంత పనిచేశారు. అంతేకాదు రేవంత్‌తో సన్నిహితంగా ఉన్న ఎమ్మెల్యే సీతక్కపై కోమటిరెడ్డి పేరెత్తకుండానే పరోక్షంగా ఘాటు విమర్శలు చేశారు.

మూడు రోజుల ముందు సభ ఖరారైతే.. కేవలం రెండు గంటల ముందు ఆదేశాలివ్వడమేంటని ఆయన ప్రశ్నించారు. టీపీసీసీ నిర్ణయం పెద్ద తప్పని.. కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా చనిపోయిన వ్యక్తి సంస్మరణ సభకి వెళ్లొద్దనడం సరికాదన్నారు. అది వైఎస్‌ని అవమానించడమే అవుతుందని కోమటిరెడ్డి స్పష్టం చేశారు. తామేమీ జగన్, షర్మిల పార్టీ మీటింగ్‌లకి వెళ్లలేదన్నారు. విజయమ్మ తనకి మూడు రోజుల కిందటే ఫోన్ చేసి సభకి వచ్చి మీ అన్న గురించి రెండు మాటలు చెప్పమంటే వస్తానని మాటిచ్చానని కోమటిరెడ్డి తెలిపారు. అన్ని పార్టీల వాళ్లు, వ్యాపారవేత్తలు, మేధావులు అందరూ వచ్చారని.. సభ వెనక ఎలాంటి రాజకీయ రహస్య ఎజెండా ఏం లేదని ఆయన స్పష్టం చేశారు. రెండు రాష్ట్రాల్లో ఎంతోమంది మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు వైఎస్సే తయారు చేసిన వారేనని అన్నారు. అలాంటి వ్యక్తి భార్య ఫోన్ చేసి రమ్మంటే వెళ్లకపోతే మానవత్వం ఉన్న మనుషులం అనిపించుకోమని కోమటిరెడ్డి వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్ పార్టీ ఎవరి సొంతం కాదని స్పష్టం చేశారు. సీతక్కపై కూడా పరోక్ష విమర్శలు చేశారు కోమటిరెడ్డి. టీడీపీ నేతలకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పాదాభివందనాలు చేస్తున్నారని.. వాళ్లకి పాదాభివందనాలు చేస్తే కాంగ్రెస్‌కి ఓట్లు పడవంటూ ఘాటు విమర్శలు చేశారు. అమెరికాలో ఒబామా కేర్ పెట్టకముందే రాజశేఖర్ రెడ్డి ఆరోగ్య శ్రీ పెట్టారని.. ఫీజు రీఇంబర్స్‌మెంట్, ముస్లింల రిజర్వేషన్ ఇచ్చిన వైఎస్‌ని పార్టీ ఓన్ చేసుకోవాలన్నారు. వైఎస్ సంస్మణ సభ విషయంలో టీపీసీసీ తప్పుడు నిర్ణయం తీసుకుందని కుండబద్దలు కొట్టారు. ఇలాంటి నిర్ణయాలు పార్టీకి నష్టం చేస్తాయని.. ఈ విషయంపై ఢిల్లీలో కూడా మాట్లాడతానని ఆయన చెప్పారు.

కోమటిరెడ్డి వ్యవహారం ఇప్పుడు టీ.పీసీసీలో చర్చనీయాంశంగా మారింది. పార్టీ హైకమాండ్ ఆదేశాలను ఆయన లెక్క చేయడం లేదని పార్టీలోని ఓ వర్గం నేతలు మండిపడుతున్నారు. సొంత పార్టీ నేతలపైనే విమర్శలు చేయడంపై కాంగ్రెస్ శ్రేణులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. కోమటిరెడ్డి తీరుపై పార్టీ హైకమాండ్ కి ఫిర్యాదు చేయాలని కొంత మంది నేతలు సలహాలు ఇస్తున్నట్లు తెలుస్తోంది.

## వైఎస్ఆర్ సంస్మరణ సభకు ఏపీ నుంచి హాజరుకాని నేతలు



అమరావతి, సెప్టెంబర్ 3:దివంగత సీఎం వైఎస్ఆర్ 12వ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం రాత్రి హైదరాబాద్‌లోని నొవాటెల్‌లో వైఎస్ విజయమ్మ ఆధ్వర్యంలో సంస్మరణ సభ నిర్వహించారు. వైఎస్‌తో అనుబంధం ఉన్న, ఆయనతో కలిసి పనిచేసిన నేతలను విజయమ్మ స్వయంగా ఆహ్వానించారు. అయితే ఏపీ నుంచి వైసీపీ నేతలు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎవరూ ఈ సభకు హాజరు కాకపోవడం గమనార్హం. తెలంగాణ కాంగ్రెస్ నుంచి మాత్రం ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఒక్కరే హాజరయ్యారు. అలాగే, బీజేపీ నేత జితేందర్‌రెడ్డి, కేవీపీ రామచంద్రరావు, రఘువీరారెడ్డి, ఉండవల్లి అరుణ్ కుమార్ తదితరులు సభకు హాజరయ్యారు. ఆహ్వానాలు అందినా టీఆర్ఎస్, మజ్లిస్, వామపక్ష నేతలు హాజరు కాలేదు.

ఈ సందర్భంగా విజయమ్మ మాట్లాడుతూ.. ఇది రాజకీయ సభ కాదని, వైఎస్సార్ సంస్మరణ సభ మాత్రమేనని స్పష్టం చేశారు. వైఎస్ భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన ప్రవేశపెట్టిన పథకాలు ఇప్పటికీ నిలిచే ఉన్నాయన్నారు. సభలో మాట్లాడిన వారి ప్రేమాభిమానాలు చూస్తుంటే వైఎస్ఆర్ తెలంగాణలో నడయాడుతున్నట్టు అనిపిస్తోందన్నారు. తన బిడ్డ షర్మిల తెలగాణ కోసం ముందుకొచ్చిందని, రాజన్న రాజ్యం కోసం తన బిడ్డను ఆశీర్వదించాలని కోరారు. వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు షర్మిల మాట్లాడుతూ.. తన తండ్రి ప్రేమించే ప్రజల్లో ఒక ప్రాంత ప్రజలు నిర్లక్ష్యానికి గురై నీరుగారిపోతుంటే చూస్తూ ఊరుకోలేనని, వైఎస్ఆర్ వర్ధంతినాడు మాట ఇస్తున్నానని, నాన్న ప్రేమించిన తెలంగాణ ప్రజల కోసం నిలబడతానన్నారు. వారి కోసం తాను కొట్లాడతానని, నిలబడి సేవ చేస్తానని అన్నారు. వైఎస్ ఇంకో పదేళ్లు బతికి ఉంటే దేశంలోనే గొప్ప నాయకుడు అయి ఉండేవారని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. వైఎస్ఆర్ శిష్యుడిగా పుట్టడం తన అదృష్టమన్నారు.

## మత్స్యకారులకు అండగా టీఆర్ఎస్ ప్రభుత్వం: మంత్రి హరీశ్ రావు

హుజూరాబాద్, సెప్టెంబర్ 3:: రాష్ట్రంలో అన్ని వర్గాలకు ప్రాధాన్యమిచ్చేలా సీఎం కేసీఆర్ చర్యలు తీసుకుంటున్నారని మంత్రి హరీశ్ రావు అన్నారు. దేశంలో ఏ ప్రభుత్వం లేనంతగా టీఆర్ఎస్ సర్కార్ మత్స్యకారులకు అండగా నిలిచిందన్నారు. రాష్ట్రంలో మత్స్య కారుల జీవితాల్లో మార్పు తెచ్చేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టిందని తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఫిషరీస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పోలి లక్ష్మణ్ ముదిరాజ్ మంత్రి హరీశ్ రావు సమక్షంలో టీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆయనకు గులాబీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఆదేశాలమేరకు ప్రభుత్వం చేపట్టిన ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమంతో చేపల ఉత్పత్తి ఘణనీయంగా పెరిగిందన్నారు. 2016-17 సంవత్సరంలో రాష్ట్రంలో 1.97 లక్షల టన్నుల చేపల ఉత్పత్తి ఉండగా, 2020-21 సంవత్సరం నాటికి అది 3.49 లక్షల టన్నులకు పెరిగిందని తెలిపారు.

ఇక్కడ ఉత్పత్తయిన చేపలలో 60 శాతం రాష్ట్ర అవసరాలకు వినియోగిస్తుండగా మిగిలిన వాటిలో 21 శాతం పశ్చిమ బెంగాల్‌కు, 19 శాతం చేపలను అసోం, తమిళనాడు, కేరళ తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నామన్నారు. మత్స్యకారులు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి సాధించాలనేది సీఎం కేసీఆర్ లక్ష్యమని చెప్పారు. కానీ మత్స్యకారులు మధ్యదళారులకు తక్కువ ధరకే చేపలను విక్రయించి నష్టపోతున్నారని వాపోయారు. వారికి ఆర్థికంగా లబ్ది చేకూర్చే ఉద్దేశంతో మత్స్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో నేరుగా మత్స్యకార సంఘాల నుంచి చేపలను కొనుగోలు చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నదని వెల్లడించారు.

మత్స్య ఫెడరేషన్ కొనుగోలు చేసిన చేపలను నాణ్యతా ప్రమాణాలతో 'తెలంగాణ చేపలు' అనే బ్రాండ్‌తో మార్కెటింగ్ చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలను రూపొందిస్తున్నదని చెప్పారు. మార్కెటింగ్ వ్యవస్థను పటిష్టపర్చడంలో భాగంగా మొబైల్ ఫిష్ ఔట్ లెట్స్‌ను ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిందని, మత్స్య సొసైటీల నుంచి కొనుగోలు చేసిన చేపలను రెండు, మూడు మండలాలను కలిపి ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి రవాణా చేస్తామన్నారు.

40 నుంచి 50 క్లస్టర్లకు ఒక ప్రధాన ప్రాసెసింగ్ యూనిట్‌కు అనుసంధానం చేస్తామని వెల్లడించారు. తొలుత హైదరాబాద్‌లోని శేరిగూడ, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్, వరంగల్‌లోని మత్స్య శాఖకు చెందిన భూములలో అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాలతో ప్రధాన ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

## వేములవాడ రాజన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 3:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ: ప్రముఖ శైవక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వరుని ఆలయానికి భక్తులు పోటెత్తారు. శ్రావణమాస చివరి శుక్రవారం, పునర్వసు నక్షత్రం సందర్భంగా వేదపండితులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, శ్రీ సీతారామచంద్ర స్వామివారికి అభిషేకాలు చేశారు. స్వామివారిని దర్శించుకోవడానికి భారీ సంఖ్యలు భక్తులు ఆలయానికి చేరుకున్నారు. దీంతో స్వామివారి దర్శనానికి మూడు గంటల సమయం పడుతున్నది. కరోనా నిబంధనలు పాటిస్తూ భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు.

## 'మా' ఎన్నికల్లో తన ప్యానెల్ సభ్యులను ప్రకటించిన ప్రకాష్ రాజ్

హైదరాబాద్ , సెప్టెంబర్ 3:మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఎన్నికల్లో పోటీ చేసే తన కార్యవర్గాన్ని ప్రముఖ నటుడు ప్రకాష్ రాజ్ ప్రకటించారు. ఆయన 'మా' అధ్యక్ష పదవికి పోటీపడుతున్న సంగతి తెలిసిందే. ప్రకాష్ రాజ్ ప్యానెల్‌లో ఉపాధ్యక్షులుగా బెనర్జీ, హేమ పోటీ చేస్తారని ప్రకాష్ రాజ్ వెల్లడించారు. ట్రెజరర్‌గా నాగినీడు, సంయుక్త కార్యదర్శులుగా అనితా చౌదరి, ఉత్తేజ్ పోటీ చేయనున్నట్టు తెలిపారు.సీనియర్ నటి జయసుధ అమెరికా వెళ్లడం వల్ల ఆమెకు ప్యానెల్లో చోటు కల్పించలేదని ప్రకాష్ రాజ్ వెల్లడించారు. అయితే ప్యానెల్‌కు తన మద్దతు ఉంటుందని జయసుధ హామీ ఇచ్చారని వివరించారు. ప్రకాష్ రాజ్ ప్యానెల్లో ప్రగతి, అనసూయ, అజయ్, సుబ్బరాజు, సమీర్, ఖయ్యూం, బ్రహ్మాజీ, కౌశిక్, ప్రభాకర్, భూపాల్, శివారెడ్డి, రమణారెడ్డి, సుడిగాలి సుధీర్, సురేష్ కొండేటి, తనీష్, టార్జాన్ సభ్యులుగా ఉన్నారు.

## రైల్వే ప్రాజెక్టులపై సమీక్ష.. కేంద్రాన్ని టైం కోరిన ఏపీ సీఎస్



అమరావతి, సెప్టెంబర్ 3:ఆంధ్రప్రదేశ్ లో వివిధ రైల్వే ప్రాజెక్టులకు భూమి సేకరించి అప్పగించేందుకు మూడు నెలలు గడువు కావలని ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదిత్యా నాథ్ దాస్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. రైల్వే, బొగ్గు, ఇంధనం, స్టీల్ ప్రాజెక్టులకు చెందిన 13 పెండింగు అంశాలపై ఆంధ్రప్రదేశ్, ఒడిస్సా, ఛత్తీస్గడ్, జార్ఖండ్ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో శుక్రవారం ఢిల్లీ నుండి ప్రగతి ప్రాజెక్టుల కేంద్ర మంత్రి మనీష్ మాండవీయ వర్చువల్ గా సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా సిఎస్ ఆదిత్యా నాథ్ దాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో విజయనగరం-టిట్లాఘర్, నడికుడి-శ్రీకాళహస్తి, కడప-బెంగుళూరు రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి మిగతా భూమి సేకరించి అప్పగించేందుకు మరో మూడు మాసాలు సమయం కావాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కేంద్ర కేంద్ర మంత్రులు.. ఆ గడువులోగా భూమి అప్పగించాలని చెప్పారు. ప్రగతి ప్రాజెక్టులను ప్రధాన మంత్రే స్వయంగా పర్యవేక్షిస్తున్నందున ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఈవిషయంలో అత్యంత శ్రద్ధ కనపర్చి ఆయా ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తయ్యేలా తోడ్పడాలని కేంద్ర మంత్రులు సూచించారు. వివిధ రాష్ట్రాల వారీ ప్రగతి ప్రాజెక్టులు పెండింగ్ అంశాలను వారు సిఎస్ లతో సమీక్షించారు.

## మీ ఓటు ప్రభుత్వ సంస్థలను అమ్మేటోళ్లకా? కాపాడేవాళ్లకా?: మంత్రి హరీశ్‌రావు



హుజురాబాద్, సెప్టెంబర్ 3:: నష్టాల్లో ఉన్న సంస్థలను అమ్మాలని కేంద్రం రాష్ట్రాలకు ఆదేశాలు ఇస్తోంది. కానీ నష్టాల్లో కూరుకుపోయిన ఆర్టీసీని కాపాడిన గొప్ప నాయకుడు సీఎం కేసీఆర్ అని ఆర్థికశాఖమంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం హుజురాబాద్ పట్టణంలోని సిటీ సెంటర్ లో జరిగిన రిటైర్డ్ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం లో ఆయన మాట్లాడారు. కరోనా మూలంగా రూ. 1కోట్ల నష్టం వాటిల్లినప్పటికీ ఉద్యోగులకు 30 శాతం పీఆర్సీ ఇచ్చిన ఘనత కేసీఆర్‌ది అన్నారు. అదే కేంద్రం కేవలం 7 శాతం పీఆర్సీ ఇచ్చి చేతులు దులుపుకుందని ఎద్దేవా చేశారు.

ఎంపీగా గెలిచిన బండి సంజయ్ ఈ రెండున్నర ఏండ్లలో కనీసం రూ.10 లక్షలు వెచ్చించి ఎక్కడైనా అభివృద్ధి చేశాడా? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఓటమి భయంతోనే ఈటల రాజేందర్ ఏదేదో మాట్లాడుతున్నాడన్నారు.నియోజకవర్గానికి 4వేల డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇస్తే ఒక్కటి కూడా పూర్తి చేయలేదని ఆరోపించారు. కనీసం ఒక్క కుటుంబాన్ని కూడా గృహప్రవేశం చేయించని విషయం నిజం కాదా? వాస్తవాలు మాట్లాడితే తప్పా? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. టీఆర్ ఎస్‌కు ఒక వ్యక్తి ప్రయోజనం కంటే, హుజురాబాద్ ప్రజల ప్రయోజనం ముఖ్యమని తేల్చి చెప్పారు. హుజురాబాద్ కు ఏం చేశారని బీజేపీకి ఓటు వేయాలి అని ఆయన అన్నారు.

గెల్లు శ్రీనివాస్ తెలంగాణ ఉద్యమకారుడని, 20 ఏండ్లుగా పార్టీలో ఉన్నాడని, క్రమశిక్షణ గల వ్యక్తి అని చెప్పారు. 2 గుంటల భూమి ఉన్న గెల్లు కావాలా.? 200ఎకరాల భూమి ఉన్న ఆసామి కావాలో ప్రజలే నిర్ణయించుకోవాలన్నారు. ప్రభుత్వ భూములను అమ్ముకుంటున్నవారికి ఓటు వేస్తారా? సంస్థలను కాపాడే సీఎం కేసీఆర్ కు ఓటు వేస్తారా? అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

## మగ కవలలకు జన్మనిచ్చిన ఆడ ఏనుగు.. 80 ఏండ్లలో ఇదే తొలిసారి



శ్రీలంక, సెప్టెంబర్ 3:శ్రీలంకలో అరుదైన ఘటన చోటు చేసుకుంది. అక్కడ 80 ఏండ్లలో తొలిసారిగా ఓ ఆడ ఏనుగు మగ కవల పిల్లలకు జన్మనిచ్చింది. 25 ఏండ్ల సురంజి అనే ఏనుగు.. ఇద్దరు మగ కవలలకు జన్మనిచ్చినట్లు వన్యప్రాణి సంరక్షణ అధికారులు ప్రకటించారు. జన్మనిచ్చిన ఏనుగు సెంట్రల్ హిల్స్‌లోని పిన్నవాలా ఏనుగుల ఆశ్రమ కేంద్రంలో ఉంటోంది. ఈ ఏనుగు పిల్లల తండ్రి పాండు (17) కూడా అక్కడే ఆశ్రయం పొందుతున్నట్లు అధికారులు వెల్లడించారు. కవలలతో పాటు తల్లి ఏనుగు ఆరోగ్యకరంగా ఉన్నట్లు తెలిపారు. సురంజి 2009లో ఒక మగ ఏనుగు పిల్లకు జన్మనిచ్చింది.శ్రీలంకలో చివరిసారిగా 1941లో ఓ ఏనుగు కవల పిల్లలకు జన్మనిచ్చినట్లు అక్కడి అధికారులు చెప్పారు. ఏనుగులు కవలలకు జన్మనివ్వడం ఒక శాతం మాత్రమే ఉంటుందని పేర్కొన్నారు. అయితే ఆఫ్రికన్ ఏనుగులు సాధారణంగా కవల పిల్లలకు జన్మనిస్తాయని అధికారులు తెలిపారు. సాధారంగా ఏనుగులు తమ జీవితకాలంలో నాలుగు నుంచి ఐదు పిల్లలకు మాత్రమే జన్మనిస్తాయి. వైల్డ్ లైఫ్ అధికారిక రికార్డుల ప్రకారం శ్రీలంకలో 200 పెంపుడు ఏనుగులు, 7 వేల అడవి ఏనుగులు ఉన్నట్టు వెల్లడించారు.

## ఏపీలో తగ్గని కరోనా కేసులు.. తాజాగా 1,520 మందికి పాజిటివ్

అమరావతి, సెప్టెంబర్ 3:ఏపీలో తగ్గని కరోనా కేసులు.. తాజాగా 1,520 మందికి పాజిటివ్ఆంధ్రప్రదేశ్ లో కరోనా కేసులు మళ్లీ పెరుగుతున్నాయి. గడచిన 24 గంటల్లో 64,739 మంది సాంపిల్స్ ని పరీక్షించడగా.. 1,520 మందికి కోవిడ్ పాజిటివ్ నిర్ధారణ అయింది. మహమ్మారికి పది బలైపోయారు. అదే సమయంలో మొత్తం 1,290 మంది కోవిడ్నుంచి పూర్తిగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యవంతులు అయ్యారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో నమోదైన కేసుల సంఖ్య 20,18,200కి చేరగా.. ఇందులో 19,89,391 మంది కోలుకున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 14,922 యాక్టివ్ కేసులు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు మొత్తం 13,887 మంది మరణించారు. కాగా, నేటి వరకు రాష్ట్రంలో 2,68,09,774 సాంపిల్స్ ని పరీక్షించినట్లు వైద్య ఆరోగ్య శాఖ తెలిపింది.

## టీమిండియా-ఇంగ్లాండ్ మ్యాచ్ లో గెల్లు శ్రీనివాస్ కు మద్దతు..

లండన్ ,సెప్టెంబర్ 3: లండన్ వేదికగా జరుగుతున్న టీమిండియా-ఇంగ్లండ్ మ్యాచ్ సందర్భంగా హుజురాబాద్ టీఆర్ఎస్ అభ్యర్థి గెల్లు శ్రీనివాస్ యాదవుకు మద్దతు లభించింది. భారత్ ? ఇంగ్లాండ్ జట్ల మధ్య జరుగుతున్న టెస్ట్ క్రికెట్ మైదానం ఓవల్‌లో ఎన్నారై టీఆర్ఎస్ నాయకుడు అబు జఫర్.. హుజురాబాద్ టీఆర్ఎస్ అభ్యర్థి గెల్లు శ్రీనివాస్ యాదవ్‌కు మద్దతుగా ప్లకార్డు ప్రదర్శించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. టీఆర్ఎస్ పార్టీలో చేరినప్పటి నుండి ఎంతో క్రియాశీలకంగా పని చేస్తూ ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తున్న అబు జాఫర్‌ని ఎన్నారై టీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్ కూర్మాచలం, ఎన్నారై టీఆర్ఎస్ యూకే అధ్యక్షుడు అశోక్ గౌడ్ దూసరి అభినందించారు

## దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ కల్యాణలక్ష్మి చెక్కులు : మంత్రి కొప్పుల



జమ్మికుంట, సెప్టెంబర్ 3:: పట్టణంలోని మారుతినగర్ లో వడ్డెర సంఘం భవన నిర్మాణానికి ప్రభుత్వం రెండు గుంటల స్థలంతోపాటు రూ.29లక్షలను మంజూరు చేసినట్లు మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. శుక్రవారం ఆయన భూమి మంజూరుకు సంబంధించిన పత్రాలను వడ్డెర సంఘాల నాయకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వడ్డెర సంఘాలకు వేర్వేరుగా భవనాలను నిర్మిస్తామన్నారు. అదేవిధంగా దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ కల్యాణలక్ష్మి చెక్కులు అందేలా చూస్తామని, ఇందుకు పైరవీలు చేయాల్సిన అవసరం లేదన్నారు. బీజేపీ నాయకులవి మాటలు తప్ప చేతల్లో ఏమీలేదని ఇక్కడి నుంచి ఎంపీగా గెలిచిన బండి సంజయ్ ఒక గల్లీని కూడా సందర్శించకపోగా పది పైసల పనిని కూడా చేపట్టలేదని ఆరోపించారు. కల్లాలు ఎత్తేస్తామని చెబుతున్న బీజేపీ నాయకులకు ఓటు వేయొద్దన్నారు.

సీఎం కేసీఆర్ రాష్ట్రాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారని ఆయన నిలబెట్టిన టీఆర్ఎస్ అభ్యర్థి గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌కు ఓటు వేసి గెలిపించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ రాజేశ్వరరావు, టీఆర్ఎస్ పట్టణ శాఖ అధ్యక్షుడు రాజ్ కుమార్, కౌన్సిలర్లు, టీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## హిమాయత్ సాగర్‌కు భారీ వరద.. నాలుగు గేట్లు ఎత్తివేత

హైదరాబాద్ , సెప్టెంబర్ 3:జీహెచ్ఎంసీ పరిధిలో గురువారం రాత్రి భారీ వాన కురిసింది. మూడు గంటలపాటు కుండపోతగా వర్షం కురవడంతో జంట జలాశయాల్లోకి వరద నీరు పోటెత్తింది. దీంతో హిమాయత్ సాగర్‌లోకి 500 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతున్నది. ఇప్పటికే చెరువు పూర్తిగా నిండి ఉండటంతో అధికారులు నాలుగు గేట్లు ఎత్తి 1400 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుల చేస్తున్నారు. హిమాయత్‌సాగర్‌లో ప్రస్తుతం 1762 అడుగుల వద్ద నీటిమట్టం ఉన్నది. సాగర్ గరిష్ఠ నీటిమట్టం 1763.5 అడుగులు.

ఇక ఉస్మాన్‌సాగర్‌లోకి 250 క్యూసెక్కుల నీరు వస్తున్నది. చెరువులో ప్రస్తుతం 1788.5 అడుగుల వద్ద నీరు ఉన్నది. సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 1790 అడుగులు.

## హుజూరాబాద్ ఉపఎన్నిక కోసమే దళితబంధు: డీకే అరుణ

హైదరాబాద్ , సెప్టెంబర్ 3:టీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన దళితబంధు పథకంపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. కేవలం హుజూరాబాద్ ఉపఎన్నిక కోసమే ఈ పథకాన్ని తీసుకొచ్చారనే విషయం ప్రజలందరికీ అర్థమయిందన్నారు బీజేపీ నేత డీకే అరుణ. ఆ పథకాన్ని ప్రజలు ఎవరూ నమ్మరని ఎద్దేవా చేశారు. టీఆర్ఎస్ ప్రభుత్వం దళిత బంధు పతకాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. హుజూరాబాద్ నియోజకవర్గంలో ఈ పథకాన్ని పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ పథకంపై బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ విమర్శలు గుప్పించారు. ఇక వికారాబాద్ జిల్లా ప్రజలను సీఎం కేసీఆర్ నిండా ముంచేశారని మండిపడ్డారు. ప్రాజెక్టుల పేరుతో వేల కోట్ల రూపాయలను వెనకేసుకున్నారని? ఆ డబ్బును ఎన్నికల్లో వెదజల్లుతున్నారని ఆరోపించారు. కులాల పేరుతో ప్రజలను విభజించి లాభం పొందాలని కేసీఆర్ యత్నిస్తున్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే బండి సంజయ్ పాదయాత్ర చేస్తున్నారని తెలిపారు.

## వినాయకులను ప్రతిష్ఠిస్తే.. సమాచారం తప్పనిసరి..

హైదరాబాద్ , సెప్టెంబర్ 3: గణేశ్ నవరాత్రులు త్వరలో ప్రారంభం కానుండటంతో పోలీసులు మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. మండపాలు ఏర్పాటు చేసుకునే వారు పోలీసులకు తప్పనిసరిగా సమాచారం ఇవ్వాలని, దీనివల్ల బందోబస్తు, నిమజ్జన ఏర్పాట్ల కోసం అన్ని శాఖలతో సమన్వయం చేసుకోవడం సులువవుతుందని ఉత్సవ కమిటీలకు సూచిస్తున్నారు. . https://www.hyderabadpolice.gov.in/ వెబ్‌సైట్ ద్వారా సమాచారం ఇవ్వాలని చెబుతున్నారు.

### నిమజ్జన ఏర్పాట్లకు కీలకం

హైదరాబాద్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే గణేశ్ నిమజ్జనోత్సవాలను ప్రశాంత వాతావరణంలో, నిర్ణీత సమయంలో పూర్తి చేసేందుకు పోలీసుల వద్ద ప్రతిష్ఠించిన గణేశ్ విగ్రహాలకు సంబంధించిన సమాచారం ఉండాలి.

దీనివల్ల ఫలాన బస్తీ, కాలనీ, అపార్టుమెంట్‌లలో ఉన్న విగ్రహాల సంఖ్య ఆధారంగా స్థానికంగా బందోబస్తు ఏర్పాట్లు చేసుకునేందుకు వీలు కలుగుతుంది. పర్యవేక్షణ కోసం క్యూ ఆర్ కోడ్‌లను కేటాయించేందుకు అవకాశముంటుంది. నిమజ్జనం రోజు ఏ రూట్లలో ఎన్ని విగ్రహాలు వస్తున్నాయనే వివరాలతో రూట్ మ్యాప్‌ను తయారు చేసుకుంటారు. ఆయా రూట్లలో జీహెచ్ఎంసీ, విద్యుత్ శాఖ, ఆర్ అండ్‌బీ శాఖల సమన్వయంతో నిమజ్జనోత్సవం సాఫీగా సాగేలా చూస్తారు.

పోలీసులు ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉండి విజుబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్రా పేర్కొన్నారు. గురువారం గచ్చిబౌలిలోని తన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో గణేశ్ నవరాత్రుల బందోబస్తుపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని నవరాత్రులు, నిమజ్జన కార్యక్రమానికి పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేసుకోవాలని సీపీ సూచించారు.

డయల్ 100కు వచ్చే ఫోన్ కాల్స్‌పై వెంటనే స్పందించాలన్నారు. ట్రాఫిక్ డీసీపీ విజయ్‌కుమార్, బాలానగర్ డీసీపీ పద్మజ, మాదాపూర్ డీసీపీ వెంకటేశ్వర్లు, ఎస్‌వోటీ డీసీపీ సందీప్, స్పెషల్ బ్రాంచి ఏసీపీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

